క్లుప్తంగా

డీసీసీ అధ్యక్షురాలికి ఫిర్యాదు

గీసుకొండ : రాంపురానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రడం భరత్ కాంగ్రెస్‌లో చేరిక చెల్లదని కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు ఫిర్యాదు చేశారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమక్షంలో ఆయన పార్టీలో చేరారని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అతడి చేరికను అంగీకరించడం లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మండల నాయకత్వం అనుమతి లేకుండా జరిగిన చేరిక చెల్లదని, భరత్‌పై చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షురాలిని కోరినట్లు కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఖానాపురం: మండలంలోని దబ్బీర్‌పేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మోతీలాల్ పదవీవిరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు సన్మానం చేసి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం డీటీఎఫ్ బాధ్యుడు జగన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పదవీ విరమణ సహజమన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరన్న, బానోతు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో పూజలు



రాయపర్తి : జయరాంతండా(ఎస్)గ్రామంలో నిర్మించిన దుర్గమ్మగుడికి ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి లక్ష రూపాయలు అందించారు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన దుర్గమ్మ పండుగలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. లేతాకుల మహేందర్‌రెడ్డి, సంది అమ్మిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రవితేజ, సురేందర్‌నాయక్, ఎంపీటీసీ గోవింద్‌నాయక్, అశోక్, ధర్మకర్త గుడి కమిటీ చైర్మన్ విజయ్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ మంద యాకూబ్‌రెడ్డి, రాజిరెడ్డి, భూక్య రాంధన్, సుమన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించొద్దు

రాయపర్తి: గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలిగించకుండా చర్యలు చేపట్టాలని ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్ సూచనలు చేశారు. మంగళవారం మండలంలోని కొండూరు, బురహాన్‌పల్లి, కాట్రపల్లి, మైలారం తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిర్వాహకులకు సూచనలు చేసినట్లు ఏపీఎం తెలిపారు. తేమ శాతం సరిగ్గా ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటాలు పెట్టించి, లారీల ద్వారా రవాణా చేయాలన్నారు. రైతులకు త్వరగా డబ్బులు అందేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. రైతులకు సౌకర్యాలను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీసీ యాదగిరి, వీఓఏలు సుచరిత, రజిత, అశోక్, మౌనిక, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామిని దర్శించుకున్న 'అరూరి'

పర్వతగిరి: మండల కేంద్రంలో శ్రీకంఠమహేశ్వరస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మంగళవారం కంఠమహేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులను శాలువా లతో సత్కరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రంగు కుమార్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్, ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే..'

సంగెం: కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒకటేనని ఆ పార్టీలకు ఓటు వేస్తే ఆగమైపోతామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్గూర్‌రంగంపేట, ఎల్గూర్‌స్టేషన్, నర్సానగర్, బీక్కోజీనాయక్‌తండా, తిమ్మాపూర్, గాంధీనగర్, కొత్తగూడెం, తీగరాజుపల్లి, సోమ్లాతండ, గవిచర్ల, షాపూర్, లోహిత, రామచంద్రపురం, ఆశాలపల్లి, కాపులకనిపర్తి, గుంటూరుపల్లి గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుళ్ల మీద ప్రమాణాలు చేస్తూ మరోసారి మోసం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారన్నారు. నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, పసునూరి సారంగపాణి, సుదర్శన్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

డీబీఎం-38 ఉపకాల్వ కబ్జా

- లెంకాలపల్లి గ్రామంలో జేసీబీతో కెనాల్‌ను ధ్వంసం చేసిన రైతు
- రాజీ కుదుర్చుకుని మరమ్మతు చేసేందుకు అవకాశం కల్పించిన అధికారులు

నల్లబెల్లి : పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎస్సారెస్పీ కాల్వను ధ్వంసం చేస్తే అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారు. రైతులపై కేసులు నమోదు చేయించి, అందుకు ఉపయోగించిన జేసీబీ వాహనాలను సీజ్ చేయిస్తారు. కానీ, ఓ వ్యక్తి కాల్వను ధ్వంసం చేసి భూమి కబ్జాకు యత్నించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంటలకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. మండలంలోని లెకాంలపల్లి శివారులో ఎస్సారెస్పీ డీబీఎం-38 ఉపకాల్వ 15 ఎల్‌ను నిర్మించింది. ఈ కాల్వ ద్వారా చెరువులు నింపి ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. దుగ్గొండి మండలంలోని గుడ్డేలుగులపల్లి గ్రామానికి చెందిన పేరం రాజయ్యకు లెంకాలపల్లి శివారులోని 15 ఎల్ కాలువకు ఇరువైపులా వ్యవసాయ భూమి ఉంది. కాగా, కాల్వను కబ్జా చేసేందుకు జేసీబీ సాయంతో ధ్వంసం చేశాడు. కాల్వలో సిమెంట్ పైపులు వేసి పూడ్చేందుకు ప్రయత్నించాడు. విషయాన్ని తెలుసుకున్న స్థానిక రైతులు ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పేరం రాజయ్య, ఆయన కుమారుడు రాజుతోపాటు ఉపయోగించిన జేసీబీ యజమానిపై ఇటీవల ఫిర్యాదు చేశారు. అధికారులు రాజీ కుదుర్చుకొని ధ్వంసం చేసిన కాల్వను 10రోజుల్లో మరమ్మతులు చేసేందుకు అవకాశం కల్పించారు. కానీ, గతంలో సాగు నీటి అవసరాల కోసం కాల్వను ధ్వంసం చేసిన పలువురి రైతులపై కేసులు నమోదు చేశారు. జేసీబీ సాయంతో కాల్వను ధ్వంసం చేసిన రైతుపై అంత ప్రేమెందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎస్సారెస్పీ ఏఈ పవిత్రను వివరణ కోరగా ధ్వంసం చేసిన రైతు 10రోజుల్లోపు మరమ్మతులు చేయిస్తాడని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజీ కుదుర్చుకున్నారని పేర్కొన్నారు.

గతంలో కాల్వ ధ్వంసం చేసిన వారిపై నమోదైన కేసుల వివరాలు..

- 2020 ఏప్రిల్ 3న ఆత్మకూరు మండలంలోని కటాక్షాపూర్ చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని తరలించేందుకు ఆయకట్టు రైతులు ఆర్శనపల్లి శివారులో కాల్వకు జేసీబీ వాహనంతో గండి పెట్టారు. కాగా, ఆరుగురు రైతులపై అధికారులు కేసు నమోదు చేశారు.
- 2023 ఫిబ్రవరి 23 వేదనగర్ శివారులో రంగాయ చెరువు కాల్వను ధ్వంసం చేసినగా ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఇవే కాకుండా పలు సంఘటనల్లో రైతులపై కేసులు నమోదు చేశారు.



లెంకాలపల్లి శివారులో ధ్వంసం చేసిన కాల్వ (ఫైల్)

గురుకుల సీట్లు సాధించిన మందపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

దుగ్గొండి: మండలంలోని మందపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు గురుకుల సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థులు ఏసిక శ్రీరామ్, పుట్టపాక యశ్వంత్, రేవూరి పూజిత, తుమ్మలపెల్లి ఆశ్లేష, కసుకుల కిరణ్మయి, కూనమల్ల వైష్ణవిలకు 5వ తరగతిలో ప్రవేశం కోసం తెలంగాణ గురుకుల పాఠశాలలో సీట్లు లభించాయన్నారు. ఈమేరకు విద్యార్థులను గ్రామ ప్రత్యేక అధికారి హరిధాస్యం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గోలి కొమురయ్య

వర్ధన్నపేట: మహిళల భాగస్వామ్యంతో ప్రభుత్వ బడులను బలోపేతం అవుతాయని అందుకు మహిళలందరు సహకరించాలని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వేణు, సీసీ గోలి కొమురయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో కాకతీయ, శ్రీమణికంఠ గ్రామైక్య సంఘాల నెలసరి సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలకు ఏర్పాటు చేసి గ్రామైక్య సంఘాల ప్రతినిధును బాధ్యులను చేసిందన్నారు. విద్యార్థులకు శిక్షణ, నైపుణ్యత కలిగిన విద్యాబోధనతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి రూ.20లక్షల విలువ గల ఇంట్రాక్టివ్ ప్యానెల్ టీవీలు, 3కంప్యూటర్లు పాఠశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో వీఓ ప్రతినిధులు అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్లు కట్ట రజిత, దాడి భవాని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఈసీ సభ్యులు, వీఓఏ మమత తదితరులు పాల్గొన్నారు.

'దొంతి'ని విమర్శించే స్థాయి 'పెద్ది'కి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చెన్నారావుపేట: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి లేదని నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, చెన్నారావుపేట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి నర్సయ్యగౌడ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితలు సోమవారం మాట్లాడిన అవగాహన లేని మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు మాత్రమే అవుతోందని, కాని బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి రాష్ట్ర ప్రజలకు, నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు ఏం ఒరగబెట్టిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జోరు వీరయ్య, కుండె కుమారస్వామి, తోట రాము, మెంతుల రమేష్, రావుల తిరుపతిరెడ్డి, ఎడ్ల మురళి, లక్క రాజు, మాచర్ల ఎల్లగౌడ్, లక్క విజేందర్, గుగులోతు నాని, కట్టయ్య, రవి, మహేందర్, కట్టయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

- ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న మాలోత్ కవిత

మహబూబాబాద్: ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ప్రమాణం చేస్తున్నారని, బీజేపీ దేవుడి పేరుతో ఓట్లు అడుగుతోందని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, ఆ రెండు పార్టీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. మంగళవారం కవిత ఆర్వో కార్యాలయంలో నామినేషన్ వేసిన అనంతరం బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి పొరపాటు చేశామని ప్రజలు అనుకుంటున్నారని, ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలతో సంబంధాలు లేవని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు ప్రజలే దేవుళ్లు అని, మాజీ సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. మే 1న మాజీ సీఎం కేసీఆర్ మానుకోటకు వస్తున్నారని, జిల్లా కేంద్రంలో జరిగే రోడ్ షోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మానుకోట, ములుగు జెడ్పీ చైర్‌పర్సన్లు ఆంగోత్ బిందు, నాగజ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, సుదర్శన్‌రెడ్డి, హరిప్రియ, కాంతారావు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, రంగారావు,. కెఎస్ఎన్‌రెడ్డి, రవికుమార్, యాకూబ్‌రెడ్డి, తేళ్ల శ్రీను, గడ్డె రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నర్సంపేట: బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాంనాయక్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బాల్నె జగన్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని 152వ బూత్‌లో బూత్ అధ్యక్షుడు రమేష్‌పాండ్య అధ్యక్షతన మంగళవారం ఇంటింటి బీజేపీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మోదీని మరోసారి ప్రధానిని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేను నరేష్, కందగట్ల శివ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

రాయపర్తి: బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించినట్లు పార్లమెంట్ రాయపర్తి ఎన్నికల కన్వీనర్ నూనె అనిల్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని 167, 168 బూత్‌లలో గడపగడపకు తిరుగుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఎనగందుల శ్రావణ్‌కుమార్, నరేష్, దినేష్, నవీన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ సభను విజయవంతం చేయాలి

వర్ధన్నపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు (బుధవారం) మడికొండలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను అన్ని వర్గాల ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో సమ్మెట సుధీర్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, మల్లెపాక సమ్మయ్య, కీమా నాయక్, నానునాయక్, గుంటికుమార్, సమ్మయ్య, రాంబాబు, అక్బర్, గోపాల్, సాయిలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు



నాచినపల్లి ఎస్సీ కాలనీలో పరిస్థితి..

దుగ్గొండి: వేసవి ఎండలు దంచి కొడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఉన్న కొద్దిపాటి నీటిని జాగ్రత్తగా ప్రజలకు అందించాల్సి ఉంది. అయితే పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టింపులేనితనంతో పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతుంది. మండలంలోని నాచినపల్లి ఎస్సీ కాలనీలో పైపులైన్ లీకేజీతో నెలరోజులుగా నీరంతా వృథాగా పోతుంది. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులు, సిబ్బందికి తెలియజేసినా.. పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరుణంలో.. నల్లా నీరు అవసరాలకు సరిపడా రావడం లేదని వాపోతున్నారు. లీకేజీలు సరిచేయడంతోపాటు నల్లాల ద్వారా ప్రతిరోజు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నర్సంపేటలో హనుమాన్ శోభాయాత్ర



మాట్లాడుతున్న పరబ్రహ్మనందగిరి స్వామి

నర్సంపేట: విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమాన్ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శోభాయాత్రలో ముఖ్య అతిథిగా పరబ్రహ్మనందగిరి స్వాములు పాల్గొని మాట్లాడారు. హిందువుల ముఖ్యమైన దేవుళ్లలో అంజనేయస్వామి ఒకరని తెలిపారు. కష్ట సమయాల్లో ఆపద్బాంధవుడిగా, కోరిన కోర్కెలు తీర్చే అభయాంజనేయస్వామిగా హనుమంతుడిని పూజిస్తారని అన్నారు. ప్రతీ సంవత్సరం చైత్ర మాసం పౌర్ణమి రోజున హనుమాన్ చిన్న జయంతిగా జరుపుకుంటారన్నారు. దేశంలో ఏ దేవుడికి లేని రెండు జయంతులు ఒక్క హనుమాన్‌కి మాత్రమే ఉంటాయని, హిందువుల ముఖ్యమైన దేవుళ్లలో ఆంజనేయస్వామి ఒకరని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేస్తున్నది మోదీ ప్రభుత్వమే..

- గాదె దయాకర్



ధర్మారంలో మాట్లాడుతున్న గాదె దయాకర్

గీసుకొండ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ పేరుతో దళితులను మోసం చేస్తోందని, గతంలో వర్గీకరణ సాధ్యం కాదని పార్లమెంట్‌లో వెల్లడించిన విషయం వాస్తవం కాదా.. అని టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గాదె దయాకర్ ప్రశ్నించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ నగరం ధర్మారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం దళితుల ఓట్ల కోసమే బీజేపీ వర్గీకరణ జపం చేస్తోందని ఆరోపించారు. దళితులు ఈ విషయాన్ని గమనించి అండగా ఉండే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. 24న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ఎన్నికల బహిరంగ సభకు కార్యకర్తలు అధికంగా తరలిరావాలన్నారు. ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. 16వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుపాకి సంతోష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మాడిశెట్టి రాజయ్య, నాయకులు మహ్మద్ జానీ, మసూద్, వల్లెం సుధాకర్,జన్ను రాజు, దాసారపు సారయ్య, కొమ్ముల బిక్షపతి, బిర్రు బాబూరావు, దుపాకి సామ్యేల్, మొట్టు శ్రీను, రవీందర్, పోలెబోయిన రాజు, భరత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: మండలంలోని దస్రుతండాకు చెందిన పలువురు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన అంగోతు శ్రవణ్‌కుమార్, హాలావత్ వీరన్న, బాదావత్ మంగ్యా, కేలోతు రవితో పాటు పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, ఎంపీపీ బీమగాని సౌజన్య, మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు ఆకుల రుద్రప్రసాద్, కూసం రమేశ్, ఎంపీటీసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో పర్వతగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి సుమారు 50మంది వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే నాగరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.సర్వర్, మాజీ ఉపసర్పంచ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు రంగు జనార్దన్, ధారావత్ రాజేందర్, వాసు వీర్య, సురేష్, వెంకన్న, రాములు, దేవిష, రమావత్ డిపూలనాయక్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మైనార్టీ నాయకులు మహ్మద్ చోట, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో మెరుగైన విద్య

రాయపర్తి: ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా మెరుగైన విద్యను పొందాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శేషమ్మ అన్నారు. మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో క్వాంటల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారీ సహకారంతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)ఆధునిక సాంకేతిక టీవీని అందించగా మంగళవారం హెచ్‌ఎం ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు సింగరాచారి, మోహన్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, స్వాతి, సురేఖ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రానివ్వొద్దు

దుగ్గొండి: వేసవికాలం పూర్తి అయ్యేంత వరకు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈ మంగీలాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ మంచినీటి సరఫరాపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా నీటి సరఫరా వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. నీరు సరిపడా లభించకుంటే సమీపంలోని బావులను అద్దెకు తీసుకోవాలని సూచించారు. లీకేజీలను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏఈ మౌనిక పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నల్లబెల్లి: మండలంలోని రుద్రగూడెంలో ఓ యువతి అదృశ్యమైంది. ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రగూడెం గ్రామానికి చెందిన దుంపేటి రామలింగం కుమార్తె సహస్ర(18) ఇంటర్ చదవుతుంది. ఈ నెల 21న సాయంత్రం కిరాణం షాపు వద్దకు వెళ్లి వస్తానని తండ్రితో చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, మిత్రుల ఇళ్లలో తెలుసుకున్న ఆచూకీ తెలియలేదు. ఇదిలా ఉండగా.. దుగ్గొండి మండలంలోని వెంకటాపురానికి చెందిన గొరుకటి సత్యం తమ కుమార్తెను తీసుకవెళ్లినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. రామలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అన్నదానం

గీసుకొండ: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని మచ్చాపూర్‌లో హనుమాన్ దీక్షా స్వాములకు మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ మంగళవారం అన్నదానం చేశారు. అనంతరం జరిగిన నగర సంకీర్తనలో దీక్షా స్వాములు, దూలం శ్రీకాంత్, లక్కర్సు రవికుమార్, బోయిన మధుకర్, పత్తిపాక రమేశ్, కంబాల రాజు, సంతోష్, బిల్ల యుగేందర్, ఏరుకొండ అరుణ్, అరసం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

సంగెం : మండలంలోని లోహిత గ్రామంలో మంగళవారం శివపంచాయతన మహాలింగేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయపురోహితులు రామకృష్ణ శర్మ, గోపి శర్మల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, కలశాభిషేకం, చండిహోమం చేపట్టారు. ఎంపీటీసీ అడ్డగట్ల దుర్గారావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


వర్ధన్నపేట: మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త చెంగల్ల చంద్రయ్య(56) సోమవారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు మంగళవారం చంద్రయ్య మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. హనుమకొండ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, జడ సతీష్, మంజులరెడ్డి, కుందూరు మహేందర్‌రెడ్డి, గుడ్ల సుభాష్, చెంగల సురేష్ ఉన్నారు.

ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన మల్లయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబులు పరామర్శించారు. ఎంపీటీసీ విజాకర్‌రావు, వల్లె శ్రీనివాస్, రాజు, లాల్‌సాహెబ్, ముస్తఫ, ఉపేందర్, నర్సయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

గీత కార్మికుడికి..

చెన్నారావుపేట: మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామానికి చెందిన వేముల ఎల్లగౌడ్ తాటి చెట్టుపై నుంచి పడడంతో కుడి కాలు విరిగి గాయాల పాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్లగౌడ్‌ను గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి గాయపడిన, మృతి చెందిన గీత కార్మికులకు బీసీ కార్పొరేషన్, ఆబ్కారి శాఖ నుంచి ఎక్స్‌గ్రేషియా మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లగౌడ్‌కు బీసీ కార్పొరేషన్ నుంచి రూ.15వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొడిశాల సదానందం గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, సాంబయ్యగౌడ్, వెంకట్‌గౌడ్, మల్లయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

నర్సంపేట రూరల్ : ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నర్సంపేట మండల మానిటరింగ్ అధికారి కొర్ర సారయ్య అన్నారు. నర్సంపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వీప్ -2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటు హక్కుపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి ఓటింగ్ శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్‌రావు భిక్షపతి, రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.